సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

వైభవుడికి పంచామృతాభిషేకం నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు శనివారం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. జ్యేష్ఠ సుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేస్తారు. అనంతరం భక్తులకు స్వామి నిజపాద దర్శనం ఉంటుంది. భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

నేడు సాయి మందిరంలో ఏకాహం



గురుపౌర్ణమి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శేషాచార్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలోని షిర్డిసాయి మందిరంలో శుక్రవారం ఏకాహం నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. జూలైలో నిర్వహించాల్సిన గురు పౌర్ణమి విజయవంతంగా జరగాలని కోరుతూ భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఓం సాయి, శ్రీసాయి, జయ జయ సాయి నామ స్మరణతో ఏకాహం ప్రారంభమై శనివారం ఉదయం ఆరు గంటలకు ముగుస్తుందన్నారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. శుక్రవారం సాయంత్ర గురు పౌర్ణమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్, ఇతర కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

వెలిగిన వీధిలైటు



మాధవధార వుడా కాలనీలో స్ట్రీట్‌లైట్ వెలుగులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ 48 లాస్ట్ బస్‌స్టాప్ రోడ్డు మలుపు వద్ద వీధిలైటు వెలిగింది. కొంతకాలంగా ఈ లైటు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు,వాహనదారులు వాపోయారు. మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడేవారు. ఈ సమస్యపై ఇటీవల ‘సాక్షి’లో ‘వెలగని వీధిలైట్లు.. అంధకారంలో రోడ్లు’ అనే శీర్షికన వార్త వెలువడిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కాటమ్మ ఆలయ వార్షికోత్సవం



సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలో కొలువైన శ్రీకాటమ్మ అమ్మవారి(మామిడి చెట్టు) దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుడు వీరభద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. నక్కవానిపాలెం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమలతో పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. సాయి భక్తులు కోలాటమాడారు. కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ నక్క కాత్రాజ్‌రెడ్డి, సెక్రటరీ కన్నారావు, కోశాధికారి నక్క రాజశేఖర్‌రెడ్డి, బర్ల బాలకృష్ణ, బర్ల పద్మలత, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

యోగాతో ఆరోగ్య భాగ్యం



యోగాసనంలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులు

- యోగా సాధనతో ఎన్నో ప్రయోజనాలు
- యోగా డే వేడుకల్లో వక్తలు
- ఉత్సాహంగా సాధకులు, విద్యార్థుల యోగాసనాలు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో యోగ సాధన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రైల్ క్లబ్‌లో యోగాసనాలు వేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ తదితరులు



యోగాసనాలు వేస్తున్న మురళీనగర్ వాసులు

సీతంపేట: ఆరోగ్యానికి యోగా ఒక్కటే మార్గమని అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనరస అన్నారు. అంతర్జాతీయ యోగా డే వేడుకలను శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఒత్తిడిని అధిగ మించడంతోపాటు బీపీ, సుగర్, థైరాయిడ్, ఒబేసిటీ వంటి ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. విద్యార్థులు యోగా చేయడం ద్వారా రోజంతా చురుగ్గా, ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ సునంద్ పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు, వివిధ రకాల యోగాసనాలు వేశారు. యఫగా ఫర్ సెల్ఫ్, యోగా ఫర్ సొసైటీ అన్నది ఈ ఏడాది యోగా డే థీమ్ అని సునంద్ పేర్కొన్నారు.

బీవీకే పాఠశాలలో..

ద్వారకానగర్ బీవీకే పాఠశాలలో యోగా డే వేడుకలను ఇండియన్ రైల్వేస్ ఆఫీస్ సూపరింటెండెంట్ పల్లా వెంకట లలితప్రతాప్, స్కూల్ కరస్పాండెంట్ బి.జె.ఎం.రవికుమార్, బీవీకే డైరెక్టర్ బుద్ధా లక్ష్మీనారాయణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగా దినోత్సవ ప్రాముఖ్యం, ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ఉత్సాహంగా వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రోజూ యోగా సాధన చేయాలి

సీతమ్మధార: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి రోజూ యోగాసనాలు వేయాలని ఎస్ఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎంసీ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం, అనారోగ్యం లేని దేశం కోసం అందరూ ప్రతి రోజూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ ప్రతినిధులు, స్కూల్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో..

సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా గల ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో యోగా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ మాట్లాడుతూ ఒత్తిడి తగ్గించుకోవడంతోపాటు శారీర రుగ్మతలను యోగా దూరంగా ఉంచుతుందన్నారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ మురళీనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. మానసిక సమస్యల పరిష్కారానికి యోగాను మించిన ఉత్తమ సాధనం మరొకటి లేదని చెప్పారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు యోగా సాధన చేయాలని సూచించారు. యోగాలో మరో ప్రక్రియ ధ్యానం చేయడం విద్యార్థులు, అన్ని వయసుల వారికి మంచిదన్నారు. యోగాసనాలు వేయడం వల్ల రోజంతా మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని వివరించారు. యోగా మన స్పందనలను సానుకూలంగా మారుస్తుందన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రోజూ యోగా చేయాలని సూచించారు. అనంతరం వివిధ రకాల యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు జె.పృథ్వీరాజ్, ఆలపాటి శ్రీనివాసరావు, మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అకౌంటెంట్స్

ఈకార్వో ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో యోగా డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో విశాఖ రైల్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో అతిథులు యోగా ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, డివిజనల్ రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఆర్.టి.జ్యోతి, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్స్ కవితా గుప్తా, మధుస్మిత సాహూ, మహిళా అధికారులు, ఉద్యోగులు, క్రీడాకారులు, గైడ్స్ తదితరులు పాల్గొన్నారు.

దీప్ భవన్‌లో..

సాలగ్రామపురంలోని దీప్ భవన్, డైరెక్టరేట్ ఆఫ్ లైట్ హౌస్, లైట్ షిప్స్ కార్యాలయంలో సిబ్బందికి రైల్వే న్యూకాలనీ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బి.కె.శశికళ, ముఖేష్ పర్మర్, డైరెక్టర్ లైట్ హౌస్(దీప్ భవన్), కబిలాష్‌సింగ్, బి.కె.అంకితా, డాక్టర్ యశ్వంత్‌భాయ్, దీప్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

విశాఖ సిటీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖ ఛాప్టర్(ఎస్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఛార్టెర్డ్ అకౌంటెంట్ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆసనాలు వేశారు. యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని అకౌంటెంట్స్ పేర్కొన్నారు. ఏయూలో యోగా డిప్లమో హోల్డర్ మింటి త్రిమూర్తులు సభ్యులను చైతన్యపరిచారు. మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ అనిర్బాన్ పాల్, కార్యదర్శి పట్నాల లోకేష్, సీఏ వాసుదేవ మూర్తి, స్టూడెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బీవీకేలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



ఎస్ఎంసీ హైస్కూల్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో యోగాసనాలు వేస్తున్న మురళీనగర్ వాసులు



దీప్ భవన్‌లో యోగా సాధన చేస్తున్న సిబ్బంది

గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

- కంచరపాలెం పీఎస్ పరిధిలో విస్తృతంగా దాడులు

మద్రిపాలెం: గంజాయి, డ్రగ్స్ మూలాలను అరికట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ను పారదోలేందుకు చర్యలు ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి నేతృత్వంలో అనేక చోట్ల గంజాయి, మత్తు పదార్థాలపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గత అర్ధరాత్రి అనేక చోట్ల దాడులు నిర్వహించారు. పెందుర్తి సీఐ రామకష్ణ ఆరుగురు సిబ్బందితో కలిసి కైలాసపురం, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, డీఎల్‌బీ క్వార్టర్స్ ఏరియాల్లో గురువారం రాత్రి గంజాయిపై దాడులు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ సమీర్ జ్ఞానాపురం, చాకలిగెడ్డ, ఆర్పీ పేట, సబాస్టియన్ కాలనీ, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆరుగురు సిబ్బందితో కలిసి, ఎస్ఐ దివ్యభారతి ఐటీఐ జంక్షన్, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గంజాయిపై తనిఖీలు చేపట్టారు. పెందుర్తి ఎస్ఐ సింహాచలం ధర్మానగర్, కంచరపాలెం ప్రాంతంలో, కంచరపాలెం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి ఎనిమిది మంది సిబ్బందితో కలిసి బర్మాక్యాంప్, మురళీనగర్, మాధవధార, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి రోజూ తనిఖీలు నిర్వహించి గంజాయి అరికట్టేందుకు కృషిచేస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్ తీసుకుంటున్న వారు ఎవరైనా సరే వదిలే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్కూల్ ఆటో డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

విశాఖ సిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్ఐ అలీ, డీన్‌లు గౌరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.

పార్సిళ్లను పరిశీలించాలి



పార్సిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీపీ(సెబ్) శ్రీనివాసరావు

విశాఖ సిటీ: కష్టమర్ల పార్సిళ్లను నిర్వాహకులు తప్పకుండా పరిశీలించాలని ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు పార్సిల్ సర్వీస్ ఆఫీస్ మేనేజర్లకు సూచించారు. నగరంలో కొన్ని పార్సిల్ సర్వీస్ సంస్థల ద్వారా తెలిసీ తెలియక గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయా సంస్థల నిర్వాహకులు, మేనేజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నేరమని, తెలిసినా, తెలియక పోయినా పార్సిళ్లలో డ్రగ్స్ లేదా గంజాయి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు, ఏసీపీ (సెబ్) సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ రాజులనాయుడు, పార్సిల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దొండపర్తిలో మెగా ఫాగింగ్



దొండపర్తిలో ఫాగింగ్ చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

సీతమ్మధార: దోమల నివారణకు దొండపర్తిలో మెగా ఫాగింగ్ నిర్వహించారు. చుక్కా వారి వీధి, పులివారివీధి, పాలికల వీధి, బాగివారి వీధి, హరిజన వీధి, కుప్పిలి వీధి, రామాలయం వీధి, సీరపు వారి వీధి, అల్లూరి వారి వీధి, దేవాంగుల వారి వీధి, మండా వారి వీధి, బాలాజీ టవర్, ద్వారకా నగర్ 6వ లైన్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించామని జీవీఎంసీ సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ తెలిపారు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు
దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8.202/2, ఆర్ ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం-530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు వినతులు



పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

‘నీట్’ లీకేజీపై నిరసన జ్వాల



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఈసీ ప్రతినిధులు

సీతమ్మధార: నీట్-2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు శంకరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి



నాగార్జునరావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్ ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులకు అడ్డుకట్ట



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బయాలజిస్ట్ సాంబమూర్తి

జగదాంబ: దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి అన్నారు. శుక్రవారం జోన్ పరిధి పాతనగరంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి కుండీలపై మూతలు పెట్టుకోవాలన్నారు. ఇంట్లోని ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. రానున్నది వర్షా కాలం కావటంతో పారిశుధ్య సిబ్బంది నీటి కుంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉండకూడదన్నారు. ప్రతి ఇంటిలో తడి-పొడి, ప్రమాదకర చెత్తను వేరే చేయటానికి మూడు రకాల డస్ట్‌బిన్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE
Addl. DISTRICT FAMILY COURT
JUDGE AT VISAKHAPATNAM
F.C.O.P.631/2023

Between
Sri. Konduru Pavan Kumar, ... Petitioner
And
Smt. Konduru (Chilla) Lavanya Reddy, ... Respondent

Respondent
Smt. Konduru (Chilla) Lavanya Reddy,
W/o. Konduru Pavan Kumar, Hindu,
Aged about 42 Years, Residing at D.No. 45-37-30, Sai Nivas, Jagannadhapuram, Akkayyapalem, Visakhapatnam.

PUBLIC NOTICE

Whereas the above named Petitioner instituted the above divorce petition against repondent. The above petition filed for the relief of dissolving marriage between the petitioner and respondent. The above petition stands posted to 26th July 2024 at 10-30 a.m. for appearance of respondent in the above Court in person or by a pleader duly instructed and able in answer all material question relating to the above divorce petition or who shall be accompanied by some person able to answer all such questions on that day in above case failing which the above petition will be decided in your absence as ex-parte.

A.Mathews &
M.V.Ramakrishna Reddy.
Advocates.
Cell : 9849357276.
Visakhapatnam
Date : 22.06.2024

మురికివాడను పరిశీలించిన డీఎంహెచ్‌వో



అప్పుఘర్‌లో మురికి వాడను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే వ్యాధులను నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అప్పుఘర్ ప్రాంతంలోని మురికివాడను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, ఇతర సబ్ యూనిట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం ఫ్రై డే డ్రై డే పాటించాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జీటీడబ్ల్యూ పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com